క్లుప్తంగా

పెన్నులు, పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సుధాగజపతి

విజయనగరం: మాన్సాస్ ట్రస్ట్ మాజీ చైర్మన్ పూసపాటి ఆనందగజపతిరాజు 74వ జయంతి వేడుకలను సోమవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ పీవీజీ రాజు స్కూల్ ఆఫ్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక కోట జంక్షన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధాగజపతి ఆనందగజపతిరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 300 మంది విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాకలపాటి వాసుదేవరాజు, పాకాలపాటి బద్రినారాయణ రాజు, సుమన్ శ్రీనివాస్ భరిడే, తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష

డెంకాడ: మండలంలోని బంటుపల్లి, గుణుపూరుపేట గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 రకాల ప్రభుత్వ సేవలు ప్రజలకు అందిస్తున్నామని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రీవెన్స్‌సెల్‌కు అధికారుల డుమ్మా



గ్రీవెన్స్‌సెల్‌కు అరకొరగా హాజరైన అధికారులు

పూసపాటిరేగ: మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌కు అధికారులు డుమ్మా కొడుతున్నారు. మండల స్థాయి అధికారులు పాల్గొనాల్సిన గ్రీవెన్స్‌సెల్‌కు దిగువ శ్రేణి ఉద్యోగులు హాజరు కావడం విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో పలు సమస్యలపై ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ జి. రామారావు, మండల వ్యవసాయాధికారి కె. నీలిమ, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చదువుపై దృష్టి సారించాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్‌బీసీసీ జిల్లా సమన్వయి అధికారి రామకృష్ణ, ప్రిన్సిపాల్ రమాదేవి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: ప్రతి ఒక్క విద్యార్థీ ప్రాథమిక స్థాయి నుంచే చదువుపై దృష్టి సారించాలని సామాజిక పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ అధికారి రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, రక్తహీనత, పౌష్టికాహార లోపం, తదితర అంశాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులు అటువంటి ప్రయత్నాలు చేస్తే బాలికలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. చిన్నతనంలోనే వివాహం చేసుకుంటే ఎన్నో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం బాల్యం చదువు కోసమేనని.. పెళ్లి కోసం కాదంటూ రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

అఖండ నామ సంకీర్తనను విజయవంతం చేయండి

- శ్రీనివాసా సేవాసంఘు అధ్యక్షుడు పిళ్లా విజయకుమార్



మాట్లాడుతున్న శ్రీనివాసా సేవాసంఘు అధ్యక్షుడు పిళ్లా విజయకుమార్, తదితరులు

విజయనగరం టౌన్: పట్టణంలోని రంగ్‌రోడ్డు టౌన్ సెంటర్ లే అవుట్‌లో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో నిర్వహిస్తున్న 108 రోజుల అఖండ నామ సంకీర్తనను విజయవతం చేయాలని శ్రీనివాసా సేవా సంఘు అధ్యక్షుడు పిళ్లా విజయకుమార్ పిలుపునిచ్చారు. ఇప్పటివరకు 48 రోజులు పూర్తయిన నేపథ్యంలో ఆలయ ఆవరణలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామ నామానికి ఉన్న శక్తి చాలా గొప్పదన్నారు. అందుకే హరే రామ, హరే కృష్ణ మహామంత్రాన్ని ప్రతిరోజూ 24 గంటలు నిర్విరామంగా 108 రోజులు ఆలపించనున్నట్లు చెప్పారు. భజన బృందాలన్నింటికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా భోజనం, వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి చెరుకూరి శ్రీధర్, దివ్యజీవన సంఘు అధ్యక్షుడు చిల్లా రామకృష్ణ, సభ్యులు శివరామకృష్ణ, భోగరాజు సూర్యలక్ష్మి, రమణమూర్తి, గౌరినాయుడు, రెడ్డి, ఈశ్వర శ్రీనివాస్, రవి, తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే తమ ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 4వ డివిజన్‌లో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరుపై ఆరా తీశారు. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. అలాగే అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారి వివరాలు తెలుసుకుని న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ వి.విజయలక్ష్మి మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతో విశిష్టమైనదన్నారు. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక రూపంలో ప్రభుత్వ పథకం అందడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దార్శనికతకు నిదర్శనమని తెలిపారు. అవినీతి, లంచగొండితనం లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందివ్వడం జగనన్నకే చెల్లిందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను మరోసారి గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ, తమ డివిజన్‌లో జరుగుతున్న గడప గడపకు.. కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. అందరికీ పథకాలు అందడంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో సమూల అభివృద్ధి..

నగరంలోని 5వ డివిజన్ పరిధి బాబామెట్ట పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్, ఏఎంసీ చైర్‌పర్సన్ నడిపేన శశిభార్గవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వ పాలన ఎలా ఉందంటూ ఆరా తీశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో తమ ప్రాంతం అన్నివిధాలుగా అభివృద్ధి చెందిందని స్థానికులు చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ గాదం మురళి మాట్లాడుతూ, స్థానిక శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. తమ డివిజన్ ప్రజలంతా మరోమారు కోలగట్లకే మద్దతు పలుకుతామని వెల్లడించారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



5వ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, లయాయాదవ్

శివారు ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని శివారు ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శంకుస్థాపన మాస మహోత్సవాల్లో భాగంగా నగరంలోని 31వ డివిజన్‌లో 35 లక్షల రూపాయలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సోమవారం శంకుస్థాపనలు చేశారు. గాయత్రీనగర్, భగవాన్ నగర్‌లోని రహదారులు, కాలువల నిర్మాణానికి, అరుంధతీ నగర్‌లోని కాలువలు, రహదారుల పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ ఎన్ని లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌ఛార్జ్ బొద్దాన అప్పారావు మాట్లాడుతూ, అభివృద్ధే అజెండాగా ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ముందుకెళ్తున్నారన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో కోలగట్ల అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపడుతున్నారని చెప్పారు. నగరంతో పాటు శివారు ప్రాంతాలలో సైతం రహదారులు, కాలువలు, వీధి దీపాలు, కుళాయిలు వంటి సౌకర్యాలు కల్పించిన ఘనత కోలగట్లకే దక్కుతుందని కొనియాడారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన తమ డివిజన్ వైఎస్సార్‌సీపీ పాలనలో అన్నివిధాలుగా అభివృద్ధి చెందిందని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, జోనల్ ఇన్‌చార్జ్ మారం బాలబ్రహ్మారెడ్డి, డివిజన్ నాయకులు రమేష్, రాజశేఖర్, కార్పొరేషన్ ఈఈ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘన జీవామృతంతో వ్యవసాయానికి మేలు

భోగాపురం: ఘన జీవామృతం వ్యవసాయానికి ఎంతో మేలు చేకూర్చుతుందని ప్రకృతి వ్యవసాయ క్లస్టర్ కార్యకర్త పీవీ గురుమూర్తి అన్నారు. మండలంలోని పోలిపల్లిలో బుగత పైడినాయుడుకు చెందిన పొలంలో ఘన జీవామృతం తయారు చేయు విధానంపై రైతులకు అవగాహ కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎకరా పొలానికి వంద కిలోల జీవామృతం సరిపోతుందన్నారు. దీనికి 100 కిలోల ఆవు పేడ, ఐదు లీటర్ల ఆవు మూత్రం, కిలో బెల్లం, కిలో శనగపిండి లేదా ఉలవ పిండి, గుప్పెడు పొలం గట్టు మట్టి తీసుకుని కొద్ది కొద్దిగా ఆవు మూత్రం చల్లుతూ కలపాలన్నారు. కలిపిన మిశ్రమాన్ని ముద్దలుగా చేసి నీడలో పలుచగా పరిచి, ఏడు రోజులు ఎండ బెట్టాలని సూచించారు. ఎండిన తర్వాత మిశ్రమాన్ని పొడిచేసి గోనె సంచులలో నిల్వ చేసుకోవాలని చెప్పారు. ఇలా తయారు చేసిన మిశ్రమాన్ని మొక్కల మొదళ్ల, దమ్ము మడిలో వేయలన్నారు. దీంతో సూక్ష్మజీవులు, వానపాములకు ఆహారం లభించి, పంటకు సూక్ష్మ, స్థూల పోషకాలు అందుతాయని చెప్పారు. తద్వారా అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ పిన్నింటి భారతి, రైతులు పాల్గొన్నారు.



ఘన జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ క్లస్టర్ కార్యకర్త పీవీ గురుమూర్తి

నడకతో ఆరోగ్యం



నడక పోటీల విజేతలు

విజయనగరం: నడకతో ఆరోగ్యం సాధ్యమని వాకర్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ – 102 గవర్నర్ సత్యం అన్నారు. తోష్నివాల్ వాకర్స్ క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ జిల్లా అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం జరిగిన నడక పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై నడక విశిష్టతను వివరించారు. తోష్నివాలా వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు అల్లంకి బసవమూర్తి, వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ఈపు విజయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 70 ఏళ్లకు పైబడిన వారి గ్రూపులో మొదటి మూడు స్థానాల్లో ఎస్. అంజిబాబు, కె. ఎర్నాయుడు, ఎస్.ఎస్ నాయుడు నిలిచారు. 60 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వయసు లోపు కేటగిరీలో మొదటి మూడు స్థానాలను టి. చిన్నారావు, పి. కృష్ణారావు, డి. శ్రీరామమూర్తి గెలుచుకున్నారు. 60 ఏళ్ల లోపు కేటగిరీలో మొదటి రెండు స్థానాలను పప్పు విశ్వనాథ్, బి. కోటేశ్వరరావు సాధించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సన్యాసిరాజు, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: తెర్లాం మండలం కాలంరాజుపేట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎగిరెడ్డి కృష్ణను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని యూటీఎఫ్ జిల్లా నాయకులు ఈశ్వరరావు, రమేష్‌చంద్రపట్నాయక్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వాహనంతో ఢీకొట్టి మారణాయుధాలతో చంపడాన్ని తీవ్రంగా ఖండించారు. కృష్ణ కుటుంబానికి యూటీఎఫ్ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి..



ఎంఆర్ కాలేజీ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

- విద్యార్థి సంఘ నాయకులు


విజయనగరం ఫూల్‌బాగ్: మహారాజా కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల గేట్ ముందు సోమవారం ఆందోళన చేపట్టారు. అయితే సిబ్బంది నుంచి ఎటువంటి హామీ రాకపోవడంతో మాన్సాస్ ఆఫీస్ ముట్టడికి పిలుపునిచ్చి మాన్సాస్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాజా కళాశాల విద్యార్థి సంఘ నాయకుడు డి. వెంకటరమణ మాట్లాడుతూ, కళాశాలను అన్‌ఎయిడెడ్‌గా మార్చినప్పటి నుంచి అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. ఇప్పటికే పలుమార్లు రీవాల్యుయేషన్ ఫీజులు, సప్లిమెంటరీ ఫీజులు దాదాపు రూ.750 వరకు పెంచుకుపోయారన్నారు. అలాగే పరీక్ష పత్రాలు గతంలో రెండు భాషల్లో ముద్రించేవాళ్లని.. ప్రస్తుతం ఇంగ్లిష్‌లో మాత్రమే ముద్రిస్తుండడంతో ఎంతో మంది విద్యార్థులు అర్థం కాక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఫెయిల్ అయిన విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు కడదామంటే ఫీజుల భారం ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో మూసేసిన కళాశాల హాస్టల్‌ని తిరిగి తెరిపించాలని కోరారు. అనంతరం పలు సమస్యలపై మాన్సాస్ విద్యాసంస్థల ప్రతినిధికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్, వెంకీ, జిల్లా కమిటీ సభ్యులు లావణ్య, పైడి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాజు, పి. రమేష్, కళాశాల విద్యార్థి సంఘ నాయకులు సంధ్య, రాజు, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బూరాడపేట రహదారికి మోక్షం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పెద బూరాడపేట గ్రామానికి వెళ్లే రహదారికి మోక్షం లభించింది. గ్రామస్తుల ఏళ్ల నాటి కల ఫలించింది. ప్రధాన జంక్షన్ నుంచి గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో వర్షం పడితే మట్టి రహదారి చిత్తడిగా మారేది. దీంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బంది పడేవారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన వేశారే తప్ప పనులు ప్రారంభించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చొరవతో రూ.45 లక్షల నిధులు మంజూరు కాగా.. ప్రస్తుతం సుమారు 650 మీటర్ల మేర సీసీ రహదారి నిర్మాణాన్ని పూర్తి చేశారు. ప్రభుత్వం చూపించిన చొరవతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నాడు పెద్ద బూరాడపేట ప్రధాన రహదారి దుస్థితి



నేడు పూర్తయిన సీసీ రోడ్డు

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

గుర్ల: గరివిడి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఐసీడీఎస్ అధికారులు సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. గుర్ల మండలంలోని గొర్లెపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న కార్యకర్త పోస్టును ఓసీ, పెద్దబంటుపల్లి కేంద్రం-1లో ఆయా పోస్టును ఎస్సీకి కేటాయించారు. అలాగే గరివిడి మండలంలోని కుమరాం కేంద్రం-1 ఆయా పోస్టును ఎస్సీ, కాపుశంభాం కేంద్రం 1 ఆయా పోస్టును ఓసీకి కేటాయించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం స్థానిక వివాహితలు ఈనెల 22లోగా ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గంట్యాడ ఐసీడీఎస్ పరిధిలో...


గంట్యాడ: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అడ్డతీగ అంగన్‌వాడీ కేంద్రం-1లో ఖాళీగా ఉన్న కార్యకర్త పోస్టు భర్తీకి ఐసీడీఎస్ పీఓ డోకుల ఉమాభారతి సోమవారం నోటిఫికేషన్ విడుదల చే శారు. పోస్టును ఓసీకి కేటాయించినట్లు పేర్కొన్నా రు. 21 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు ఉన్న పదో తరగతి ఉత్తీర్ణులైన స్థానిక వివాహితులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

వలంటీర్లు.. నిస్వార్థ సేవకులు



విజయనగరం: వలంటీర్లు నిస్వార్థ సేవకులని, అటువంటి వారిపై రాజకీయ ఆరోపణలు చేయడం తగదని ప్రజలు అంటున్నారు. దళారీలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు లబ్ధిదారుల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్న వలంటీర్లను ప్రజలు కుటుంబ సభ్యులుగా భావిస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ వల్ల సమాజానికి ఏం లాభమని జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ప్రజలు మండిపడుతున్నారు. గతంలో ఏ చిన్న పనికైనా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని.. అప్పుడు మా బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియక చాలా ఇబ్బంది పడ్డామని ప్రజలు చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఏర్పాటు కావడంతో తమ కష్టాలన్నీ తీరిపోయాయని, ఇంటివద్దకే పాలన అందుతోందని ఆనందంగా చెబుతున్నారు.

ఇంటి ముంగిటకు సేవలు..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించిన వలంటీర్ వ్యవస్థతో ప్రభుత్వ సేవలన్నీ ఇంటి ముంగిటకు వస్తున్నాయి. వలంటీర్లు నేరుగా ఇళ్లకు వచ్చి కావాల్సిన అవసరాలు తీర్చే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో ఎవరికి వారు భయపడి బతుకుతున్న సమయంలో ఇంటింటికీ వచ్చి మందులు, నిత్యావసరాలు సరఫరా చేశారు. వారి సేవలు బాగున్నాయి. ప్రభుత్వం మంచి వ్యవస్థను ప్రారంభించింది. ప్రజలందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– ఎర్రంశెట్టి గౌతమ్‌కుమార్, స్టేడియం కాలనీ, 27వ డివిజన్, విజయనగరం.

గతం కన్నా మెరుగైన పాలన..



గత ప్రభుత్వాలు కన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో మెరుగైన పాలన చూస్తున్నాం. ప్రధానంగా ఆయన ప్రారంభించిన వలంటీర్ వ్యవస్థ చాలా బాగుంది. ఇది వరకు ఏ అవసరం వచ్చినా తహసీల్దార్, మున్సిపాలిటీ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. వలంటీర్లు వచ్చిన తర్వాత వారే ఇంటింటికీ తిరిగి మా అవసరాలు తీరుస్తున్నారు. వారి స్థాయిలో జరగని పనులు సచివాలయాల ద్వారా అందిస్తున్నారు. వలంటీర్ సహకారంతో కాపు నేస్తం అందుకున్నాను. మా అమ్మకు పింఛన్ వచ్చింది.

– బి.పుష్ప, స్టేడియం కాలనీ, విజయనగరం.

కుటుంబ సభ్యుల్లా...



వలంటీర్లు సొంత కుటుంబ సభ్యుల్లా మా యోగ, క్షేమాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. నేను వంటరి మహిళను. నాకు అంతగా ఏమీ తెలియదు. నాకు అవసరమైన కుల ధృవీకరణ పత్రం కోసం వారే వచ్చి వివరాలు సేకరించి దరఖాస్తు చేయించారు. జగనన్న చేయూత పథకానికి దరఖాస్తు పెట్టారు. ఇల్లు లేదని చెబితే ఇంటికోసం వివరాలు తీసుకున్నారు. వలంటీర్ సేవలు అందరికీ ఎంతగానే ఉపయోగపడుతున్నాయి.

– బట్టాన కంచమ్మ, జొన్నగుడ్డి, విజయనగరం.

అన్ని వారే చూసుకుంటున్నారు:



గతంలో ఏ అవసరమొచ్చినా మేమే తిరగాల్సి వచ్చేది. వలంటీర్లు వచ్చిన తర్వాత ఆ పరిస్థితి లేదు. వారే వచ్చి మాకు కావాల్సిన పనులన్నీ చేస్తున్నారు. మూడేళ్లుగా మా బాబుకు అమ్మఒడి పథకం వస్తోంది. సొంతిల్లు లేదంటే గుంకలాంలో ఇల్లు కేటాయించేలా చేశారు. కుల, నివాస, ఆదాయ ధృవీకరణ పత్రాలను అందజేశారు. వాళ్లు చేస్తున్న సేవలు ఎనలేనివి.

– కె.వరలక్ష్మి, జొన్నగుడ్డి, విజయనగరం.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కొత్తవలస: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. ఈనెల 14న కృష్ణా జిల్లా అవనిగడ్డలో న్యాయవాది జి.శ్రీనివాసరావుపై కక్షిదారులు కొందరు మారణాయుధాలతో దాడిచేసి గాయపరిచిన ఘటనకు నిరసనగా విధులను బహిష్కరించామని స్థానిక బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.వి.వి.గిరిబాబు తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు. న్యాయవాదులు జి.మహేంద్ర, గండి శ్రీరామ్మూర్తి, ఈ.సత్యనారాయణ, కొట్యాడ అచ్చి బాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.